క్లుప్తంగా

క్రీడాకారులను అభినందించిన కలెక్టర్

నల్లగొండ టూటౌన్: సంగారెడ్డి జిల్లాలో జరిగిన స్టేట్ మీట్ నేషనల్ సెలక్షన్ పోటీల్లో జిల్లాకు చెందిన అన్‌స్టాపబుల్ కరాటే జిమ్నాస్టిక్ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ చాటారు. ప్రతిభ చాటిన క్రీడాకారులు యశ్వంత్, శ్రీహర్షవర్ధన్‌ను బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ పల్ల పవన్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ పీఓకు..

నల్లగొండ రూరల్ : వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ –2024కు ఎంపికైన నడిగూడెంలోని కేఎల్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ జానిపాషా ను ఎంజీయూ వీసీ బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. మహారాష్ట్రలో నిర్వహించే వెస్ట్‌జోన్ ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు జానిపాషా ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శాంతకుమారి, ఎంపీడీఓ జయలక్ష్మి

చిట్యాల: మండలంలోని మంచినీటి సరఫరా సహాయకులకు నాలుగు రోజులుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. శిక్షణ పూర్తి చేస్తున్న వారికి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శాంతకుమారి, చిట్యాల ఎంపీడీఓ జయలక్ష్మి సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో డీఈఈ నర్సింహ, ఏఈ సత్యం, ఏఈఈ అరుణ్‌కుమార్, సీటి నాణ్యత నిపుణులు వీరారెడ్డి, క్రాంతికుమార్, ఉపేందర్ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

నకిరేకల్ : పట్టణంలోని తాటికల్ రోడ్డులో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన పడిదల కృష్ణ గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. కృష్ణ మృతదేహాన్ని కాంగ్రెస్ నేత దైద రవీందర్ సందర్శించి దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేలను బాధిత కుటుంబానికి అందజేశారు.

స్నేహితుడి కుటుంబానికి..

కనగల్ : మండల పరిధిలోని బోయినపల్లి గ్రామానికి చెందిన బుచ్చల నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు నాగరాజుతో పాటు జి.ఎడవెల్లి ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యాసంవత్సరంలో ఎస్సెస్సీ చదువుకున్న స్నేహితులు బుధవారం రూ.70,000 అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాలు అందజేత

చిట్యాల: రాష్ట్రంలో ఇప్పటి వరకు ముప్పై లక్షల మంది బీజేపీ సభ్యత్వాలు తీసుకున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గందమల్ల ఆనంద్‌గౌడ్, సభ్యత్వ నమోదు రాష్ట్ర ప్రముఖ్ గోలి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. చిట్యాలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం వారు పరిశీలించి పలువురికి సభ్యత్వాలు అందజేసి మాట్లాడారు. సభ్యత్వ నమోదు మండల ఇన్‌చార్జ్ మాస శ్రీనివాస్, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, లింగస్వామి, రమేష్, రమణ, నాగాచారి, మహాలింగం, రామకృష్ణ, పున్న విష్ణు, సాగర్ల వెంకటేష్ పాల్గొన్నారు.

బాలల పరిరక్షణపై అవగాహన

నాంపల్లి : పిల్లలను అమ్మడం, హింసించడం, నేరమని అందుకు చట్టపరంగా శిక్షార్హులవుతారని బాలల పరిరక్షణ జిల్లా కమిటీ సభ్యుడు రాము అన్నారు. బుధవారం బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నాంపల్లి మండలంలోని గట్లుమల్లేపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సీహెచ్ నవీన్‌రెడ్డి అధ్యక్షతన బాలల హక్కులపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సైదులు, రాములమ్మ, అమరేందర్, రజిత, దీపిక తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంత ప్రారంభం

చిట్యాల: మండలంలోని తాళ్లవెల్లంల గ్రామంలో అంగడి(వారాంతపు సంత)ను బుధవారం ఆ గ్రామ మాజీ సర్పంచ్ జనగాం రవీందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మయ్య, పజ్జూరి అజయ్‌కుమార్‌రెడ్డిలు ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి బుధవారం గ్రామంలో అంగడిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అంగడిలో జీవాలు, పశువులు అమ్మకం కొనుగోలుతోపాటు కూరగాయలు, నిత్యావసర వస్తువులు, దుస్తుల అన్ని రకాల వస్తువులు లభ్యమయ్యేలా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఛాయా సోమేశ్వరాలయంలో సాగర్ ఎమ్మెల్యే పూజలు

రామగిరి(నల్లగొండ): పానగల్లు ఛాయా సోమేశ్వరాలయంలో బుధవారం నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శివ లింగానికి అభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, అర్చకుడు ఉదయ్‌శర్మ పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పారదర్శకంగా చేపట్టాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

చండూరు : తప్పులు లేకుండా సమగ్ర కుటుంబ సర్వే చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం చండూరు మున్సిపల్ కేంద్రంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు ప్రజలు ఆధార్, రేషన్ కార్డు, ధరణి పాస్‌బుక్ వంటి వాటితో సిద్ధంగా ఉండి సర్వేకు సహకరించాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

కేతేపల్లి: సమగ్ర కుటుంబ సర్వేను నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేయాలని అడిషనల్ కలెక్టర్ జె.శ్రీనివాస్ ఎన్యుమరేటర్లను ఆదేశించారు. కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో జరుగుతున్న సమగ్ర, సామాజిక, ఆర్థిక ఇంటింటి సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. తొలి దశలో ఈ నెల 6 నుంచి 9 వరకు ఇళ్లను గుర్తించి ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించాలని సూచించారు. సర్వేపై ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. సేకరించిన విషయాలను గోప్యంగా ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దారు ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఏఓ బి.పురుషోత్తం ఉన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే పరిశీలన

నల్లగొండ రూరల్ : సమగ్ర కుటుంబ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ మండలంలోని చందనపల్లిలో సమగ్ర కుటుంబ సర్వే తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే చేపట్టాలని ఎన్యుమరేటర్లను, సూపర్‌వైజర్లను ఆదేశించారు. ఇంటికి తాళం వేసి ఉంటే మరోసారి వెళ్లాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు అలీ, గౌస్ తదితరులు ఉన్నారు.

17 పంచాయతీల్లో సర్వే ప్రారంభం

నకిరేకల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే నకిరేకల్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో బుధవారం ప్రారంభమైంది. మున్సిపాలిటీతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సర్వే తీరును తహసీల్దార్ జమీరుద్దీన్, ఎంపీడీఓ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ బాలయ్య పర్యవేక్షించారు. కుటుంబాల గుర్తింపు కార్యక్రమం ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగుతుందని తహసీల్దార్ జమీరుద్దీన్ తెలిపారు. 9 నుంచి 19వ తేదీ వరకు సర్వే జరుగుతుందన్నారు.

నార్కట్‌పల్లి : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం నార్కట్‌పల్లి మండలంలో ఎన్యుమరేటర్లు 3265 ఇళ్లకు స్టిక్కర్లు అతికించినట్లు తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఉమేష్ తెలిపారు. ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సర్వే సక్రమంగా చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు.

గట్టుప్పల్ మండలంలో..

చండూరు : కుటుంబ సమగ్ర సర్వే గట్టుప్పల్ మండల కేంద్రంలో బుధవారం ప్రారంభమైంది. మొదటిరోజు సిబ్బంది ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు వేశారు. 150 కుటుంబాలను ఒక బ్లాక్‌గా విభజించారు. ప్రజలు సర్వేకు సహకరించాలని తహసీల్దారు రాములు సూచించారు. ఆయన వెంట కార్యదర్శి షఫీ తదితరులు ఉన్నారు.

ప్రతి కుటుంబాన్ని గుర్తించాలి

మునుగోడు: గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని గుర్తించి ఆ ఇంటికి స్టిక్కర్ అతికించాలని ఎంపీడీఓ విజయ భాస్కర్ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి మునుగోడు మండలంలోని 27 గ్రామాల్లో సమగ్ర సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సర్వేకు మండలంలో మొత్తం 113 మందిని నియమించామన్నారు. అందులో 93 మంది ఎన్యుమరేటర్లు, 10 మంది సూపర్‌వైజర్లతోపాటు మరో 9 మందిని రిజర్వ్‌గా నియమించామన్నారు. మొదటి రోజు ఇంటింటికి వెళ్లి స్టిక్కరింగ్ అంటించి కుటుంబాలను గుర్తిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి స్వరూపరాణి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

శాలిగౌరారం: మండల కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వే స్టిక్కరింగ్ పనులను బుధవారం మండల ప్రత్యేక అధికారి మాన్యానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయనవెంట ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఎంఈఓ సైదులు, పంచాయతీ కార్యదర్శి విజయ్ ఉన్నారు.



చండూరులో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



కేతేపల్లి: ఇనుపాములలో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ జె.శ్రీనివాస్



నల్లగొండ రూరల్ : చందనపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి



మునుగోడు: స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయ భాస్కర్



నకిరేకల్ : మండలాపురంలో సర్వే తీరును పరిశీలిస్తున్న తహసీల్దార్ జమీరుద్దీన్



గట్టుప్పల్‌లో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు రాములు



నార్కట్‌పల్లి : సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



డి.వర్షిని



కె. శ్రీజ

శాలిగౌరారం: మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న డి.వర్షిని, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.శ్రీజ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ బుధవారం తెలిపారు. విద్యార్థినులు ఈ నెల 5న జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. డి.వర్షిని జిల్లా జట్టుకు కెప్టెన్‌గా నియమితులయ్యారు. గురువారం నుంచి ఈ నెల 9 వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థినులు పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ బొడ్డు మల్లేష్ ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల ధర్నా

నకిరేకల్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నకిరేకల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పెన్షనర్లు నకిరేకల్‌లోని ఎస్టీఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు సీహెచ్.అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పట్టేటి కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి యానాల కృష్ణారెడ్డి, సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు బిచెనేపల్లి ప్రకాష్‌రావు, కె.మల్లయ్య, లింగారెడ్డి, బీఎస్‌రెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పెన్షనర్లు

ప్రత్యేక తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : నల్లగొండ రూరల్ మండలానికి ప్రత్యేక తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం, పత్తి కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేసి రైతులను ఆదుకోవాలన్నారు. పాలడుగు నాగార్జున, కొండ అనురాధ, సయ్యద్‌హాషం, దొండ కృష్ణారెడ్డి, సైదులు, ప్రభావతి, అంజయ్య, వెంకన్న, సత్యనారాయణ, రవీందర్, లింగస్వామి, పార్వతమ్మ, యాదగిరి, గోపాల్, జానయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మునుగోడు: చొల్లేడు గ్రామానికి చెందిన చిలువేరు విజయకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.20వేల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు అందజేశాడు. జంగిలి నాగరాజు, గ్రామశాఖ అధ్యక్షుడు బుడిగపాక రవి, సైదులు, రుద్రయ్య పాల్గొన్నారు.

మర్రిగూడ : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మర్రిగూడ మండలంలోని యరగండ్లపల్లి గ్రామానికి చెందిన ముద్దం పద్మకు రూ.54వేలు, వల్లముల నర్సమ్మకు రూ.20వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. కాగా బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ లబ్ధిదారులకు ఆ చెక్కులను అందజేశారు. అదేవిధంగా రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఐతగోని లక్ష్మీకి మంజూరైన రూ.18,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్ అందజేశారు.

సీపీఐ శత వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

మర్రిగూడ : సీపీఐ శత వార్షికోత్సవాన్ని కార్యకర్తలు ఘనంగా జరుపుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రఘుమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, ముఖ్య కార్యకర్తలు బి.సురేష్, బుర్ర శేఖర్, నిరంజన్, గిరి, బాలకిషన్, మహేందర్, వెంకట్రామ్, నరసింహ, అంజయ్య, పొట్ట గిరి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల మాయలో పడొద్దు



మాట్లాడుతున్న సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ

నల్లగొండ క్రైం : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారి మాయలో పడొద్దని సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో సైబర్ జాగరుకత దివస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సైబర్ నేరానికి గురైతే 1930 నంబర్‌కు, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయవద్దని సీనియర్ సిటిజన్‌లు, రిటైర్డ్ ఉద్యోగులకు సూచించారు.

కొనసాగుతున్న దీక్షలు

నల్లగొండ రూరల్ : మున్సిపల్ కార్మికుల పెండింగ్ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగుతున్న మున్సిపల్ కార్మికుల 3వ రోజు దీక్షకు ఆయన మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సలీం, అశోక్ రెడ్డి, రమేష్, కరుణ, కృష్ణవేణి, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని తులసీనగర్ శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో షష్టి తిథి సందర్భంగా గురువారం రాత్రి 7 గంటలకు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కళాశిక కుశలయ్య తెలిపారు. ఉదయం 7 గంటలకు స్వామివారికి అభిషేకం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించాలని కోరారు.

తేమతో సంబంధం లేకుండా కొనుగోళ్లు చేయాలి

మునుగోడు: తేమశాతంతో సంబంధ లేకుండా పత్తి, ధాన్యం కొనుగోళ్లు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మునుగోడులోని సీపీఎం కార్యాలయంలో జరిగిన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 రోజుల క్రితం పత్తి, వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి నేటికీ కొనుగోళ్లు చేయకపోవడం సరికాదన్నారు. కావాలనే కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, మిర్యాల భరత్‌కుమార్, జేరిపోతుల ధనంజయ్య, వరికుప్పల ముత్యాలు, యసరాని శ్రీను, యాట యాదయ్య, పగిళ్ల మధు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల తల్లిదండ్రులకు బుధవారం లయన్స్ క్లబ్ ఎలైట్ నల్లగొండ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. సుమారు రూ.5వేల విలువ చేసే దుప్పట్లను 18 మందికి ఆపాఠశాల హెచ్ఎం అంబటి అంజయ్య, క్లబ్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాస్‌తో కలిసి అందజేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చిట్యాల: రైతులు పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకుని మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి, ఆరెగూడెం గ్రామాల్లో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలను బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. అంతకుముందు చిట్యాల పట్టణంలోని సీసీఐ కేంద్రాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో డెయిరీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, తహసీల్దార్ కృష్ణనాయక్, ఎంపీడీఓ జయలక్ష్మి, ఏఎంసీ సెక్రటరి జానయ్య, సీసీఐ సీపీఓ కృష్ణరావు, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

శాలిగౌరారం: రైతుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండలంలోని మాధారంకలాన్ గ్రామ పరిధిలో గల టీఆర్ఆర్ కాటన్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన పత్తిని ప్రభుత్వం సీసీఐ కేంద్రంలో క్వింటాలుకు రూ.7521 మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, సీసీఐ ఇన్‌చార్జులు రజినీకాంత్, రాజు, సింగిల్‌విండో చైర్మన్ తాళ్ళూరి మురళి, డైరెక్టర్ నోముల రవి, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చీనానాయక్, కాటన్‌మిల్లు యజమాని తానం జోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి మండలంలో..

నార్కట్‌పల్లి : పత్తి రైతులు సీసీఐ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు, నార్కట్‌పల్లి మండలంలోని చౌడంపల్లి గ్రామ సమీపాన గల వరలక్ష్మి కాటన్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులకు పత్తి విక్రయించి మోసపోవద్దన్నారు. ముందుగా కాటన్ మిల్లు యాజమాని శ్రీధర్‌రెడ్డి, వరలక్ష్మి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, మార్కెట్ కమిటీ కార్యదర్శి జానయ్య, సీసీఐ సీపీఓ కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, బండా సాగర్‌రెడ్డి సట్టు సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, జేరిపోతుల భారత్, వడ్డెగోని నర్సింహ, ఉదయ్‌కుమార్, యాదయ్య, సత్తి, పశుపతి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: పెద్దకాపర్తిలో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



నార్కట్‌పల్లి : చౌడంపల్లిలో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం



శాలిగౌరారం : మాధారంకలాన్‌లో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



తిప్పర్తి : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్



కేతేపల్లి : ఇనుపాముల కేంద్రంలో కాంటా అయిన ధాన్యం బస్తాలు

తిప్పర్తి : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్ అన్నారు. తిప్పర్తి మండలంలోని మల్లెపల్లివారిగూడెం వద్ద ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. ఏపీఎం శ్రీదేవి, ముత్తినేని శ్యాంసుందర్, వనపర్తి అంజయ్య, తండు సాయిలు, జంజిరాల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల కోసం కేతేపల్లి మండలంలో ఆరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఇనుపాముల, కొత్తపేట, చీకటిగూడెం, కొర్లపహాడ్, కొప్పోలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఆయా కేంద్రాల్లో బుధవారం సాయంత్రం వరకు మొత్తం 8 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల్లో లోడు చేసి వెంటనే మిల్లులకు తరలించారు. తుంగతుర్తి కేంద్రంలో గురువారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

మాలధారులకు నిత్యాన్నదానం ప్రారంభం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులకు దాతల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని మాజీ ప్రజాప్రతినిధులు దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి అన్నదాన కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ప్రథమంగా ఐతరాజు యాదయ్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండారు శ్రీనివాస్, దోసపాటి ప్రసాద్, విష్ణుమూర్తి, పల్రెపాటి యాదగిరి, జ్ఞానేశ్వర్‌గిరి, ఇరుకుల భిక్షమయ్య, అమరవాది రాములు, సత్తయ్య, వాసుదేవ్, వీసం బాలరాజు, మట్టిపల్లి యాదగిరి, ఉప్పరి స్వామి, రామచంద్రయ్య, పెరుమల్ల రవి, గణేశ్, సంతోష్, అనంతుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం గ్రామ కార్యదర్శుల ఎన్నిక

చిట్యాల: మండలంలోని వివిధ గ్రామాల సీపీఎం గ్రామ శాఖ నూతన కార్యదర్శులను ఎన్నుకున్నట్లు పార్టీ చిట్యాల మండల రూరల్ కార్యదర్శి అర్రూరి శ్రీను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిట్యాల మండలంలోని పిట్టంపల్లి కార్యదర్శిగా బాతరాజు గోపాలు, వెలిమినేడు–1 కార్యదర్శిగా నాతి వెంకట్రామయ్య, వెలిమినేడు–2 కార్యదర్శిగా అర్రూరి దుర్గయ్య, వెలిమినేడు–3 కార్యదర్శిగా సుర్కంటి మోహన్‌రెడ్డి, గుండ్రాంపల్లి కార్యదర్శిగా కత్తుల యాదయ్య, సుంకెనపల్లి కార్యదర్శిగా పంతంగి నర్సింహాచారి, చిన్నకాపర్తి కార్యదర్శి వీరమళ్ల వెంకన్న, ఆరెగూడెం కార్యదర్శిగా మెట్టు తిరుమలయ్య, ఉరుమడ్ల కార్యదర్శిగా బెలిజ మల్లయ్య, ఎలికట్టె కార్యదర్శి గోపగోని వెంకన్న, తాళ్లవెల్లెంల కార్యదర్శిగా పామనగుళ్ల దశరథ, నేరడ కార్యదర్శిగా కందగట్ల గణేశ్, వనిపాకల కార్యదర్శిగా కృష్ణయ్య, వట్టిమర్తి కార్యదర్శిగా బూరుగు శ్రీను, ఏపూరు కార్యదర్శిగా ఎరసాని పరమేష్, పేరేపల్లి కార్యదర్శిగా అంతటి యాదయ్య, పెద్దకాపర్తి కార్యదర్శిగా కొత్త మీనయ్య ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

పత్తిని కొనుగోలు చేయాలి

చండూరు: కొర్రీలు పెట్టకుండా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం రైతులు చండూరు మండలం బంగారిగడ్డ సీసీఐ కొనుగోలు కేంద్రం ఎదుట ధర్నాకు దిగారు. తేమశాతం రావడం లేదని పత్తిని కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్ వెంకన్నగౌడ్ వచ్చి రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.



ధర్నా చేస్తున్న రైతులు